సాక్షి

అల్లూరి సీతారామరాజు జిల్లా

శుక్రవారం ၊ 17 ၊ ఫిబ్రవరి ၊ 2023



స్వయం సహాయక సంఘాల బలోపేతానికి కృషి

8లో

పనితీరు మెరుగుపరచుకోవాలని ఐటీడీఏ పీవో ఆర్.గోపాలకృష్ణ స్పష్టం చేశారు.



రక్తదానంతో ప్రాణదానం

రక్తదానం ప్రాణదానంతో సమానమని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. కలెక్టరేట్‌లో రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. 8లో

చింతపల్లిలో @7 డిగ్రీలు



సాక్షి,పాడేరు: జిల్లాలోలో గురువారం చింతపల్లి ఆర్ ఏఆర్ఎస్ వద్ద 7 డిగ్రీలు, పాడేరు మండలం మినుములూరులో 12 డిగ్రీలు, అరకు కేంద్ర కాఫీ బోర్డు వద్ద 11.2 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

జాతరకు వేళాయె!

శివరాత్రి ఉత్సవాలకు జిల్లాలోని శైవక్షేత్రాలు ముస్తాబయ్యాయి. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అధికార యంత్రాంగం, ఉత్సవకమిటీలు ఏర్పాట్లు పూర్తిచేశాయి. పుణ్యక్షేత్రం మత్స్యగుండంలో మూడు రోజులపాటు నిర్వహించే జాతరకు ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చే అవకాశం ఉన్నందున విస్తృత ఏర్పాట్లు చేశారు.

- ఉత్సవాలకు శైవక్షేత్రాల్లో ఏర్పాట్లు పూర్తి
- మత్స్యగుండలో నేటి నుంచి ఉత్సవాలు
- ఇతర రాష్ట్రాల నుంచి భారీగా భక్తులు తరలివచ్చే అవకాశం
- భారీ స్థాయిలో పోలీసు బందోబస్తు

సాక్షి,పాడేరు: నిత్యపూజలందుకుంటున్న పవిత్ర మత్స్యగుండం మహిమాన్విత పుణ్యక్షేత్రంగా గుర్తింపు పొందింది. ఉమ్మడి తెలుగు రాష్ట్రాలతో పాటు ఒడిశా, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలనుంచి స్వామివారిని దర్శించుకునేందుకు తరలివస్తుంటారు. మహాశివరాత్రి సందర్భంగా ప్రభుత్వ యంత్రాంగం ఆధ్వర్యంలో హుకుంపేట మండలం మఠం పంచాయతీ గిరిజనులు ఈ నెల 17,18,19 తేదీల్లో ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తిచేశారు. జిల్లాకేంద్రమైన పాడేరుకు 10 కిలోమీటర్ల దూరంలో ఈ క్షేత్రం ఉంది.

మత్స్యాలే దేవతలు

జి.మాడుగుల మండలం గెమ్మెలి ప్రాంతంలో చిన్న ధారలా మొదలైన మత్స్యగెడ్డ క్షేత్రానికి సమీపంలో పెద్ద నదిలో ప్రవహిస్తుంది. గేదె గెడ్డ ప్రవాహం కూడా తోడవడంతో మత్స్యగుండాన్ని ఉత్తర వాహినిగా పిలుస్తుంటారు.

- మత్స్యలింగేశ్వరస్వామికి నిత్యపూజలు జరుగుతాయి. స్వామివారి దర్శనం అనంతరం కొండ దిగువన ఉన్న మత్స్యగుండానికి భక్తులు మెట్ల మార్గంలో వెళుతుంటారు.
- మత్స్యగెడ్డ ప్రవాహంలో బండరాళ్ల మధ్యలో సొరంగంలా ఉండే గుండంలో చేపలను మత్స్యదేవతలుగా భక్తులు కొలుస్తారు. ఇంత పెద్ద ప్రవాహంలో మత్స్యాలు కొట్టుకుపోకుండా గుండం చుట్టూ తిరగడం మహిమగా చెబుతుంటారు.
- నాగదేవతకు భక్తులు పూజలు చేస్తారు. ఆలయానికి దగ్గరలోని పుట్ట వద్ద నాగదేవత సంచరిస్తుందని చెబుతుంటారు. అప్పుడప్పుడు కనిపించే పాము నాగదేవత ప్రతిరూపంగా భక్తులు భావిస్తున్నారు.



మత్స్యగుండం క్షేత్రంలోని మత్స్యలింగేశ్వరస్వామి

- భక్తుల సౌకర్యార్థం ఈ ఏడాది బండరాళ్లపై మెట్లు నిర్మించారు.

15 ఆర్టీసీ సర్వీసులు

మత్స్యగుండంలో శుక్రవారం నుంచి ప్రారంభమయ్యే శివరాత్రి ఉత్సవాలకు భక్తుల సౌకర్యార్థం 15 ప్రత్యేక ఆర్టీసీ బస్సులు నడుపుతున్నామని పాడేరు డిపో మేనేజర్ రోణంకి సీతారాంనాయుడు తెలిపారు. శనివారం తెల్లవారుజాము నాలుగు గంటల నుంచి పాడేరు సాయిబాబా గుడి, పాతబస్టాండ్, ఆర్టీసీ కాంప్లెక్స్‌ల నుంచి మత్స్యగుండం క్షేత్రానికి సర్వీసులు అందుబాటులో ఉంటాయన్నారు. టికెట్ ధర రూ.25గా నిర్ణయించినట్టు చెప్పారు. శుక్రవారం రాత్రి జి.మాడుగులలో ఒకటి, అరకులోయన రెండు, జోలాపుట్, ముంచంగిపుట్టులో కూడా నైట్ హాల్టులు ఉంచుతున్నట్టు ఆయన పేర్కొన్నారు.



మత్స్యగుండంలో పూజలందుకుంటున్న మత్స్యాలు

చివరి దశకు ఉత్సవ ఏర్పాట్లు

కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాల మేరకు ఎస్పీ సతీష్ కుమార్, ఐటీడీఏ పీవో ఆర్.గోపాలకృష్ణ, సబ్‌కలెక్టర్ అభిషేక్ పర్యవేక్షణలో ఉత్సవ ఏర్పాట్లు చివరి దశకు చేరుకున్నాయి. మత్స్యగుండం క్షేత్రంలో విద్యుత్ అలంకరణతో పాటు స్వాగత ద్వారాలు, సెలయేరు మెట్ల మార్గంలో లైట్లు ఉత్సవ కమిటీ ఏర్పాటు చేసింది. ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు.

- తాగునీటి సౌకర్యాలు అందుబాటులోకి తెచ్చారు. దుకాణ సముదాయాల స్థలాలు కేటాయించారు. జీసీసీ సంస్థ కూడా తమ ఉత్పత్తుల అమ్మకాలకు ప్రత్యేక స్టాల్‌ను ఏర్పాటు చేస్తోంది.
- భారీ పోలీసు బందోబస్తుకు సంబంధించి 200 మంది సిబ్బంది, 20మంది ఎస్‌ఐలను జాతర విధులకు కేటాయించారు. సెలయేరు వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేశారు. గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచారు. జాతర మూడురోజులు వైద్య ఆరోగ్యశాఖ వైద్యశిబిరాలను నిర్వహిస్తోంది. రెండు అంబులెన్స్‌లు, పారిశుధ్య సిబ్బందిని అందుబాటులో ఉంచారు.

నేటి నుంచి జాతర

మత్స్యగుండంలో శివరాత్రి ఉత్సవాలకు శుక్రవారం వేకువజాము నుంచి ప్రారంభించనున్నారు. ఇక్కడ కొలువుదీరిన మత్స్యలింగేశ్వరస్వామికి పాలాభిషేకంతో పూజలను ప్రారంభిస్తారు. బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు శివలింగాల ప్రదర్శన జరుగుతుంది.

మత్స్యదేవతల దర్శనానికి..

శివరాత్రి నాడు ప్రత్యేక పూజలతో పాటు మత్స్యగుండంలో మత్స్యదేవతల దర్శనానికి ఏర్పాట్లు చేస్తున్నారు. అదేరోజు మధ్యాహ్నం మఠం గ్రామం నుంచి మత్స్యగుండం వరకు శివపార్వతుల విగ్రహాల ఊరేగింపు జరుగుతుంది. రాత్రి 8గంటలకు శివపార్వతుల కల్యాం, మధ్యాహ్నం దాతల సాయంతో అన్నసమారాధన, రాత్రికి పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేశారు. ఉత్సవాల చివరి రోజు ఆదివారం మోదమాంబ తాపీమేస్త్రిల సంఘం ఆధ్వర్యంలో అన్నసమారాధనకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.



విద్యుత్ దీపకాంతుల్లో మత్స్యదేవత



జాతరకు ముస్తాబైన మత్స్యగుండం క్షేత్రం



మత్స్యగుండం సెలయేరు

ఘనంగా ఉత్సవాల నిర్వహణ



మత్స్యగుండంలో మూడు రోజుల జాతరను విజయవంతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశాం. ప్రభుత్వ యంత్రాంగం అన్ని విధాల ఉత్సవాలకు సహకరిస్తోంది. ఉత్సవ కమిటీ ప్రతినిధులతో పాటు మఠం పంచాయతీలోని అన్ని వర్గాల భక్తులు భక్తుల సేవే లక్ష్యంగా పనిచేస్తున్నాం.

– మఠం శాంతికుమారి, సర్పంచ్, మఠం

బొర్రాలో విస్తృత ఏర్పాట్లు

అనంతగిరి: మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన బొర్రాగుహల లోపల కొలువై ఉన్న శివాలయం వద్ద మహాశివరాత్రి నాడు శివునికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. మహాశివరాత్రికి ముందు రోజే ఛత్తీస్‌గఢ్, ఒడిశా, ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి భక్తులు బొర్రాకు చేరుకుంటారు. స్వామివారికి పూజలు అనంతరం రాత్రంతా జాగారం చేస్తారు.

పంచాయతీ, వర్తకసంఘం ఆధ్వర్యంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేశారు. పర్యాటకశాఖ సిబ్బంది గుహల వద్ద గిరిజన సంప్రదాయమైన థింసా, ఒడియా భాగవతం ఏర్పాటు చేస్తున్నారు. గుహ నుంచి హోటళ్ల వరకు విద్యుత్ అలంకరణ ఏర్పాట్లు జరుగుతున్నాయి. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పంచాయతీ సర్పంచ్ అప్పారావు ఏర్పాట్లు చేస్తున్నారు.



బొర్రా శివాలయంలో కొలువైన శివుడు

సర్ప రూపంలో సర్వేశ్వరుడు

వై.రామవరం: పూతగుంట పరమేశ్వరుడి ఆలయంలో శివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ ఆలయం మండలంలోని చవిటిదిబ్బలు గ్రామ ప్రధాన రహదారికి సుమారు 4 కిలోమీటర్ల దూరంలోని అటవీ ప్రాంతంలో ఉంది. ఆలయం ఎదుట ఉన్న పెద్ద బండరాయి పైనుంచి జల ప్రవాహం, ప్రకృతి అందాలు కనువిందు చేస్తున్నాయి. మండలంలోని గురమంద విశ్వనాథుని ఆలయానికి విచ్చేసే భక్తులంతా పూతిగుంట పరమేశ్వరుడిని దర్శించుకుని వెళ్తుంటారు. ఏటా కార్తీకమాసంలో రెండు నాగుపాములు వచ్చి శివలింగంపై తిరుగుతుండేవి. ఆలయ సింహద్వారంపైన గాడిలో కార్తీకమాసం 15రోజులపాటు దర్శన మిచ్చేవి. ఆ తరువాత అదృశ్యమయ్యేవని చెబుతుంటారు. సాక్షాత్తూ పరమేశ్వరుడే పాముల రూపంలో దర్శనమిస్తున్నారని భక్తుల నమ్మకం. శివరాత్రి ఉత్సవాలకు ఆలయ కమిటీ సభ్యులు కలిమెల బాబూరావు ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు.



వై.రామవరం మండలంలో పూతిగుంట పరమేశ్వరుడు



ఆలయ పరిసరాల్లోని జలపాతం



పూతిగుంట పరమేశ్వరుని ఆలయంలో భగవంతుని రూపంగా కొలుస్తున్న సర్పాలు (ఫైల్)

నాలుగు రాత్రుల జాగారం

రాజవొమ్మంగి : ఇక్కడికి సమీపంలోని వట్టిగెడ్డ వాగు వద్ద కొండపై వెలసిన శ్రీరాజరాజేశ్వరి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద చలువ పందిర్లు ఏర్పాటుచేశారు. జడ్డంగిలో మడేరు వాగు చెంత కొండగుహలో స్వయంభువుగా వెలసిన భ్రమరాంబికా మల్లికార్జున స్వామి వారి ఆలయంలో 18వ తేదీ నుంచి నాలుగు రోజులపాటు జరిగే శివరాత్రి జాగారాలకు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేశారు. శివుని విగ్రహం జల్లుస్నానం సౌకర్యం ఏర్పాటుచేశారు. కళావేదిక ఏర్పాట్లుఏశారు. రోడ్డును వెడల్పు చేశారు.



శివుని విగ్రహ రూపంలో జల్లుస్నాన ఘాట్

- వంచంగి సమీపంలో రక్షిత అటవీప్రాంతంలోని పురాతన కుంతీలింగేశ్వరస్వామి ఆలయం వద్ద శివరాత్రి మహోత్సవాలకు గిరిజన ప్రతినిధులు ఏర్పాట్లు చేశారు. కొండకోనల్లో నివసించే ఆదివాసీలు భారీగా తరలి వచ్చి పూజలు చేస్తుంటారు.



వనదుర్గాసమేత నాగలింగేశ్వరస్వామి



జడ్డంగి కొండగుహలో స్వయంభువుడిగా వెలిసిన భ్రమరాంబిక మల్లికార్జునస్వామి

- వాతంగి జలపాతం వద్ద గల వనదుర్గాసమేత నాగలింగేశ్వరస్వామి వారి ఆలయం వద్ద ఐదు రోజుల శివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి.
- లాగరాయి, లబ్బర్తి, కింద్ర గ్రామాల్లో కూడా ఉత్సవాలు జరిపేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. బట్టావారివీధి అటవీప్రాంతంలో స్వయంభువుడిగా వెలిసిన బుడిబుడి జంగమేశ్వరస్వామి తిరునాళ్లకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

న్యూస్‌రీల్


మిగులు ధాన్యం కొనుగోలుకు వినతి



పీవో సూరజ్ ధనుంజయ్‌తో మాట్లాడుతున్న ఎంపీపీ, సర్పంచ్

చింతూరు: మండలంలోని రైతుభరోసా కేంద్రాల్లో మిగిలి ఉన్న ధాన్యాన్ని త్వరితగతిన కొనుగోలు చేయాలని ఎంపీపీ సవలం అమల ఐటీడీఏ పీవో సూరజ్ ధనుంజయ్ గనోరేను కోరారు. గురువారం ఐటీడీఏ కార్యాలయంలో ఆమె పీవోను కలసి రైతుభరోసా కేంద్రాల్లో మిగిలివున్న ధాన్యం నిల్వల వివరాలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో ఇప్పటివరకు 4,468 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని చెప్పారు. రైతుభరోసా కేంద్రాల్లో 1,175 మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వ ఉందని, వీటిని మిల్లర్లు కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టాలని ఆమె కోరారు. దీనిపై స్పందించిన పీవో మాట్లాడుతూ మిగిలిన ధాన్యం కొనుగోలు చేసేలా చర్యలు చేపడతామని హామీనిచ్చారు. సర్పంచ్ కారం కన్నారావు, ఉపసర్పంచ్ కారం సాయిబాబు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు గిరి విద్యార్థులు



ఎంపికైన రామకృష్ణ, వినోద్‌కుమార్

అనంతగిరి: మండలంలోని శివలింగపురం గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాలకు చెందిన విద్యార్థులు పి.రామకృష్ణ, జె.వినోద్‌కుమార్ ఖోఖో అండర్–14 విభాగంలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విశాఖలో ఈనెల 17 నుంచి 19 వరకు జరగనున్న పోటీల్లో వీరు పాల్గొంటారు. వీరిని హెచ్‌ఎం శెట్టి సుబ్బారావు, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

జగన్ నాయకత్వంతోనే మంచి భవిష్యత్తు

- బాక్సైట్ అనుకూల జీవోల రద్దు చరిత్రాత్మకం
- వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థి సుధాకర్

సాక్షి,పాడేరు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంతోనే రాష్ట్రానికి మంచి భవిష్యత్తు అని ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థి సీతంరాజు సుధాకర్ అన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు,పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అధ్యక్షతన స్థానిక మోదకొండమ్మతల్లి కల్యాణ మండపంలో వైఎస్సార్‌సీపీ సమావేశాన్ని గురువారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిపక్ష నేత హోదాలో గిరిజనులకు ఇచ్చిన మాటకు కట్టుబడి అధికారంలోకి రాగానే బాక్సైట్ అనుకూల జీవోలన్నీ రద్దు చేసి,గిరిజన ప్రాంతాలలో స్వేచ్ఛగా జీవించేలా చరిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారన్నారు. గిరిజన ప్రాంతాలపై అవగాహన ఉన్న తనను ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులంతా మొదటి ప్రాధాన్య ఓటును తనకు వేసి గెలిపించే విధంగా వైఎస్సార్‌సీపీ శ్రేణులంతా కృషి చేయాలని కోరారు. అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు, మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు,ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ మత్స్యరాస వెంకటలక్ష్మి మాట్లాడారు. పట్టభద్రుల ఓట్ల నమోదులో వైఎస్సార్‌సీపీ నేతలంతా ఎంతో కష్టపడ్డారని, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఉపాధ్యాయులు, పట్టభద్రులంతా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వాన్నే కోరుకుంటున్నారన్నారు. ఎమ్మెల్సీగా సుధాకర్‌ను గెలిపించి సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి మరోసారి కానుక ఇద్దామని వారు కోరారు. అన్ని గ్రామాల్లోని ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలు విస్తృత ప్రచారం చేయాలని, ఓటు వేసే విధానంపై పట్టభద్రులకు అవగాహన కల్పించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో జీసీసీ చైర్‌పర్సన్ స్వాతిరాణి, ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ తమర్బ నర్సింగరావు, వ్యవసాయ సలహా మండలి జిల్లా అధ్యక్షురాలు సరస్వతి, పాడేరు, చింతపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్లు కూతంగి సూరిబాబు, జి.రాజులమ్మ, జెడ్పీటీసీలు కిముడు శివరత్నం,పోతురాజు బాలయ్య, ఎంపీపీలు బోయిన కుమారి,కోరాబు అనూషదేవి, ఎస్,రత్నకుమారి, విద్యార్థి విభాగం నేత తెడబారికి సురేష్‌కుమార్, మండల పార్టీ అధ్యక్షులు బెబ్బులి లక్ష్మణ్,జల్లి బాబులు, సీదరి రాంబాబు,మోరి రవి తదితరులు పాల్గొన్నారు.





మాట్లాడుతున్న ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థి సీతంరాజు సుధాకర్, వేదికపై ఎమ్మెల్యే కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి, అరకు ఎంపీ మాధవి, విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, హాజరైన పార్టీ నేతలు

ఎమ్మెల్సీగా సీతంరాజును గెలిపిద్దాం..

అనంతగిరి: ఉత్తరాంధ్రపై అవగాహన ఉన్న ఎమ్మెల్సీ వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను మెజారిటీతో గెలిపించి సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ఉత్తరాంధ్ర తరఫున కానుకగా ఇద్దామని అరకు ఎంపీ గొడ్డేటి మాధవి అన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌రాజుతో కలిసి ఆమె పర్యటించారు. ముందుగా కాశీపట్నం కొత్తమ్మతల్లి, అనంతగిరి నూకాంబిక అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అనంతగిరి బాలికల–1 పాఠశాలలోని ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఎంపీ మాధవి మాట్లాడుతూ ఉత్తరాంధ్ర, గిరిజన ప్రాంతంపై అనుభవంగా ఉన్న వ్యక్తి సీతంరాజు సుధాకర్‌రాజు అన్నారు. ఆయనను గెలిపించుకోవాలని కోరారు. అనంతరం సీతంరాజు సుధాకర్‌రాజు మాట్లాడుతూ ఉద్యోగులు మరో రెండు నెలల్లో శుభవార్త వింటారన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్మన్ జల్లిపల్లి సుభద్ర, జీసీసీ చైర్‌పర్సన్ శోభ స్వాతిరాణి, రాష్ట్ర ఎస్టీసెల్ అధ్యక్షురాలు మత్స్యరాస వెంకటలక్ష్మి, ఎస్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శెట్టి గంగాధరస్వామి, ఎంపీపీ శెట్టి నీలవేణి, తదితరులు పాల్గొన్నారు.

విజయానికి సమష్టి కృషి

అరకులోయ రూరల్: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థి సీతంరాజు సుధాకర్ విజయానికి అందరూ సమష్టిగా కృషిచేయాలని అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ పిలుపునిచ్చారు. మండలంలోని పద్మాపురంలో ఓ ప్రైవేట్ రిసార్ట్స్ ఆవరణలో నియోజకవర్గంలోని ఆరు మండలాల జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, మండల పార్టీ అధ్యక్షులు, కన్వీనర్లు, గృహ సారథులు, ముఖ్య నాయకులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ బలపర్చిన ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ గెలుపునకు అందరూ కలిసికట్టుగా పనిచేద్దామన్నారు. విశాఖ ఉమ్మడి జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు, నియోజకవర్గ పరిశీలకుడు కొండలరావు తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జీసీసీ చైర్‌పర్సన్ స్వాతిరాణి, ఎస్టీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శెట్టి గంగధరస్వామి, మహిళ అధ్యక్షురాలు వెంకటలక్ష్మి, ఎంపీపీలు శెట్టి నీలవేణి, ఉషారాణి, ఈశ్వరి, రాజబాబు, జెడ్పీటీసీలు శెట్టి రోషిణి, మత్స్యలింగం, బొంజుబాబు, జానకి తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ అభ్యర్థి సుధాకర్‌ను పరిచయం చేస్తున్న ఎమ్మెల్యే పాల్గుణ, వేదికపై ఎంపీ మాధవి, నియోజకవర్గ పరిశీలకుడు కొండలరావు, విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, జీసీసీ చైర్‌పర్సన్ స్వాతిరాణి

గిరి విద్యార్థిని మృతిపై చర్యలు

- విద్యుత్ స్తంభం పడిన ఘటనపై కలెక్టర్ సుమిత్‌కుమార్ స్పందన
- ఎంఈవో, టీచర్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ సస్పెన్షన్

సాక్షి,పాడేరు: హుకుంపేట మండలం తాడిపుట్టు పంచాయతీ ఉర్రాడ బొడ్డాపుట్టు ప్రాథమిక పాఠశాల సమీపంలో మంగళవారం విద్యుత్ స్తంభం పడి పడి ఆరవ తరగతి గిరిజన విద్యార్థిని దన్విత మృతి సంఘటనపై కలెక్టర్ సుమిత్‌కుమార్ స్పందించారు. ఈ ఘటనలో మరో బాలిక గాయపడింది. ఈ ఘటనను తీవ్రంగా పరిగణించిన కలెక్టర్ సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకున్నారు.

దీనిలో భాగంగా హుకుంపేట ఎంఈవో ఎస్.రామచంద్రరావు, పాఠశాల హెచ్‌ఎం జంపరంగి ప్రసాద్, తాడిపుట్టు సచివాలయం ఇంజనీరింగ్ అసిస్టెంట్ కె.లక్ష్మిని సస్పెండ్ చేస్తూ ఆయన ఉత్తర్వులు జారీ చేసినట్టు పాడేరు ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ తెలిపారు.

బాధిత కుటుంబానికి బాసట



గర్భశోకంతో ఉన్న తల్లిదండ్రులకు కలెక్టర్ స్పందన సాంత్వననిచ్చింది. గిరిజన దంపతులు విశాఖ కేజీహెచ్ నుంచి శిశువు మృతదేహంతో గురువారం స్కూటీపై బయలుదేరారని తెలుసుకున్న కలెక్టర్ సుమిత్‌కుమార్ అంబులెన్స్ ఏర్పాటు చేశారు. పాడేరు నుంచి వారి స్వగ్రామమైన ముంచంగిపుట్టు మండలం కుముదు గ్రామానికి అంబులెన్సులో తరలించారు. - ముంచంగిపుట్టు

సర్వ దోషాలను హరించే దివ్యక్షేత్రం రంప



రంపచోడవరం శివాలయం

రంపచోడవరం: రంప శివాలయం సర్వదోషాలను హరించే దివ్యక్షేత్రంగా రంపచోడవరం శివాలయం వెలుగొందుతోంది. మహాశివరాత్రి పర్వదినం నాడు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాతో పాటుగా అనేక మంది భక్తులు ఆలయాన్ని దర్శిస్తారు. రంప గ్రామంలో దిగువ ఒక శివాలయం, కొండపైన ఉన్న మరో శివాలయం ఉంది.శివరాత్రి రోజుల వచ్చే భక్తులు కొండపై ఉన్న జలపాతం వద్ద స్నానాలు చేసి అక్కడ శివాలయాన్ని దర్శించుకుంటారు. మహాశివరాత్రి ముందురోజు రంపచోడవరం పోలీస్‌స్టేషన్‌లో ఉన్న పంచలోహ విగ్రహాలను ఊరేగింపుగా రంప శివాలయంకు తీసుకువస్తారు. మహాశివరాత్రి రోజు కల్యాణం నిర్వహిస్తారు. రంప భ్రమరాంబిక మల్లికార్జున స్వామి ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా సకల సౌకర్యాలను ప్రభుత్వ అధికారులు కల్పిస్తున్నారు. ఈ నెల 18 నుంచి మూడు రోజులు పాటు జరిగే మహాశివరాత్రి ఉత్సవాలు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తారు. ఇందుకు రెవెన్యూశాఖ పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేస్తోంది. ఎస్పీ సతీష్‌కుమార్ రంప శివాలయాన్ని గురువారం సందర్శించారు. శివరాత్రి ఉత్సవాలకు సంబంధించి చేపట్టాల్సిన చర్యలపై పోలీసు అధికారులతో చర్చించారు. రంపచోడవరం ఏఎస్పీ అధిరాజ్‌సింగ్‌రాణా ఉన్నారు.



రంప శివాలయాన్ని సందర్శించిన ఎస్పీ సతీష్‌కుమార్

హత్య కేసులో నిందితుడికి రిమాండ్

పెదబయలు : మండలంలోని గోమంగి పంచాయతీ కుమ్మరివీధి గ్రామానికి చెందిన కొంతేరి సొన్నన్న (55)ను నరికి చంపిన నిందితుడిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించడం జరిగిందని జి.మాడుగుల సీఐ సత్యనారాయణ తెలిపారు. ఈ నెల 12తేదీన కుమ్మరి వీధి గ్రామానికి చెందిన కొంతేరి సొన్నన్నను ఇదే గ్రామానికి చెందిన కుమ్మరి గణపతిరావు కత్తితో దారుణంగా నరికి హత్య చేసిన విషయం తెలిసిందే.

ఈ ఘటనపై హత్య కేసు నమోదు చేసి గురువారం నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐ మనోజ్‌కుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

స్వయం సహాయక సంఘాల బలోపేతానికి కృషి

- వెలుగు సిబ్బంది పనితీరు మెరుగుపడాలి
- ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ



ఏటీడబ్ల్యూవోలు, ఎంఈవోల సమావేశంలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ

పాడేరు రూరల్ : స్వయం సహాయక సంఘాలను బలోపేతం చేసేందుకు వెలుగు అధికారులు, సిబ్బంది కృషి చేయాలని, వెలుగులో పని చేసే ప్రతీ ఒక్కరూ తమ పనితీరును మెరుగుపరచుకోవాలని ఐటీడీఏ పీవో ఆర్.గోపాలకృష్ణ స్పష్టం చేశారు. స్వయం సహాయక సంఘాల ఏర్పాటులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. పాడేరు కాఫీ హౌస్ సమావేశ మందిరంలో ఏజెన్సీ 11 మండలాల వెలుగు క్షేత్ర స్థాయి అధికారులు, సిబ్బందితో గురువారం సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో పీవో మాట్లాడుతూ కొత్త సంఘాల ఏర్పాటు, స్వయం సహాయక సంఘాల గ్రేడ్లు, బుక్ కీపింగ్, బ్యాంకు లింకేజీ, రైతు ఉత్పత్తిదారుల సంఘాల పనితీరు, వీడీవీకే నిర్వహణ, స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో జరుగుతున్న ఉత్పత్తులపై మండలాల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐటీడీఏ పరిధిలో కొత్తగా 1100 స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా నిర్ధారిస్తే 467 ఏర్పాటు చేశారన్నారు. మిలిగిన 633 సంఘాలను ఈనెలఖారులోగా పూర్తి చేయాలన్నారు. ఎన్ని సంఘాలు ఉన్నాయి, ఇప్పటి వరకు ఎన్ని సంఘాలకు బ్యాంకు లింకేజీ ఇచ్చారంటూ ఆయన ప్రశ్నించారు. ప్రతి సంఘానికి అందించాలని చెప్పారు. మంజూరు చేసిన వీడీవీకేలను ప్రారంభించాలని సూచించారు. జి.మాడుగుల, జీకే వీధి మండలాల్లో నిర్మిస్తున్న ఏకో పల్పింగ్ యూనిట్లలో మహిళ సంఘాల భాగస్వామ్యం కావాలన్నారు. ఈ సమావేశంలో వెలుగు ఏపీడీ మురళి, ఎల్‌డీఎం రవితేజ, పీఎంయూ ప్రోగ్రాం అధికారులు ప్రేమ్‌కుమార్, అంజనా, ఆర్. రాంగోపాల్, పి.మల్లికార్జున, జీసీసీ డీఎం పార్వతమ్మ, 11 మండలాల ఏసీలు, డీపీఎంలు, ఏపీఎంలు పాల్గొన్నారు.

టెన్త్ ప్రణాళిక పక్కాగా అమలు

పాడేరు రూరల్ : పదో తరగతి విద్యార్థులకు 57 రోజుల ప్రణాళిక పక్కాగా అమలు చేయాలని ఐటీడీఏ పీవో ఆర్.గోపాలకృష్ణ ఆదేశించారు. గురువారం పాడేరు ఐటీడీఏ సమావేశ మందిరంలో ఏజెన్సీ 11 మండలాలకు చెందిన ఏటీడబ్ల్యూవోలు, ఎంఈవోలు, హెచ్‌ఎంలతో సమావేశం నిర్వహించారు. పదో తరగతి విద్యార్థులకు ఉపయోగపడే విధంగా మాదిరి ప్రశ్న పత్రాలు తయారు చేసినట్టు చెప్పారు. విద్యార్థులకు ప్రతీ రోజు టెస్ట్‌లను నిర్వహించాలన్నారు. పరీక్ష పత్రాలను మూల్యాంకన చేసి విద్యార్థుల సామర్థ్యాలు గుర్తించి, తగిన విధంగా శిక్షణ అందించాలని తెలిపారు. ఏప్రిల్ మూడో తేదీ నుంచి టెన్త్ విద్యార్థులకు పరీక్షలు జరుగుతాయని చెప్పారు. పాడేరు డివిజన్ పరిధిలో 39 పరీక్ష కేంద్రాల్లో 153 పాఠశాల విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్టు తెలిపారు. మాల్ ప్రాక్టీస్‌కు అవకాశం లేకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలన్నారు. పరీక్ష కేంద్రాలు ఉన్న పాఠశాలల్లో మనబడి నాడు నేడు పనులు త్వరిత గతిన పూర్తి చేసి విద్యార్థులకు తగిన విధంగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. టెన్త్ సిలబస్ సకాలంలో పూర్తి చేయాలన్నారు. ఇప్పటికి 31 శాతం మంది ఉపాధ్యాయులు ముఖ హాజరు వేయడం లేదన్నారు. సమావేశంలో గిరిజన సంక్షేమ శాఖ డీడీ కొండలరావు, డీఈవో రమేష్, ఏటీడబ్ల్యూవోలు రజనీ, క్రాంతి కుమార్, మల్లికార్జునరావు, ఎంఈవోలు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

నిర్వాసితుల కాలనీల్లో సమస్యల పరిష్కారానికి చర్యలు

- పోలవరం ప్రాజెక్టు ఆర్‌అండ్‌ఆర్ కమిషనర్ శ్రీధర్


నేలదోనెలపాడు ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో మాట్లాడుతున్న పోలవరం ప్రాజెక్టు ఆర్‌అండ్‌ఆర్ కమిషనర్ శ్రీధర్, అడ్మినిస్ట్రేటర్ ఆఫీసర్ ప్రవీణ్ ఆదిత్య, సబ్‌కలెక్టర్ శుభం బన్సాల్

గంగవరం : పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల ఆర్ అండ్ ఆర్ కాలనీల్లో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని పోలవరం ప్రాజెక్టు ఆర్‌అండ్‌ఆర్ కమిషనర్ శ్రీధర్ తెలిపారు.గంగవరం మండలం నేలదోనెలపాడు వద్ద దేవీపట్నం మండలం కొండమొదలు పంచాయతీ గ్రామాల పోలవరం ముంపు నిర్వాసితులకు ఏర్పాటు చేసి ఆర్‌అండ్‌ఆర్ కాలనీని ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్ ఆఫీసర్ ప్రవీణ్ ఆదిత్య, రంపచోడవరం సబ్‌కలెక్టర్ శుభం బన్సాల్‌తో కలిసి గురువారం ఆయన సందర్శించారు. నేలదోనెలపాడు ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో నిర్మించిన గృహాలను, పాఠశాల, ఆరోగ్య ఉపకేంద్రం, అంగన్‌వాడీ తదితర ప్రభుత్వ భవనాలను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన గ్రీవెన్స్ నిర్వహించి, నిర్వాసిత గిరిజనులతో సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా కొండమొదలు సర్పంచ్ యాట్ల విజయ ఆధ్వర్యంలో నిర్వాసితులు అధికారులను కలిసి వివిధ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో ఏర్పాటు చేసిన పాఠశాలను అభివృద్ధి చేయాలని, కాలనీలో అంతర్గత రోడ్లు నిర్మించాలని, కొండ కాలువలు, పంట కాలువలపై వంతెనలు నిర్మించాలని, నిర్వాసితుల కోసం ప్రభుత్వం సేకరించిన గిరిజనులకు అప్పగించాలని కోరారు. నిర్వాసిత కుటుంబాలకు కొంత మందికి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అందలేదని అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. నిర్వాసిత గిరిజనుల సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆర్ అండ్‌ఆర్ కమిషనర్ శ్రీధర్ హామీ ఇచ్చారు. పలు సమస్యల పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. గంగవరం, దేవీపట్నం తహసీల్దార్లు శ్రీమన్నారాయణ, పి.రామకృష్ణ, ఆర్‌ఐ జిలానీ, ఎంఈవో మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అడవుల సంరక్షణపై ప్రత్యేక దృష్టి

- సబ్ డీఎఫ్‌వో భరణి


విలేకరులతో మాట్లాడుతున్న సబ్‌డీఎఫ్‌వో భరణి

రాజవొమ్మంగి: రక్షిత అటవీభూములు అన్యాక్రాంతం కాకుండా, విలువైన వృక్ష సంపదపై గొడ్డలి వేటు పడకుండా ప్రత్యేక దృష్టి సారించినట్టు రంపచోడవరం సబ్ డీఎఫ్‌వో భరణి తెలిపారు. రాజవొమ్మంగి అటవీ కార్యాలయాన్ని ఆమె గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ వన్యప్రాణుల సంరక్షణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. తన పరిధిలోని అటవీ ప్రాంతంలో మొక్కలు నరికివేతకు గురైనట్టు సమాచారం అందడంతో టేకు, మారు జాతి వనాలను పరిశీలిస్తున్నట్టు చెప్పారు. అగ్నిప్రమాదాలను అరికట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నట్టు ఆమె తెలిపారు. అడవుల సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై స్థానిక రేంజ్ అధికారి అబ్బాయిదొర, ఇతర అటవీ అధికారులతో మాట్లాడారు. తిమ్మాపురం బీట్‌లో పెద్ద ఎత్తున (సుమారు 10 ఎకరాల్లో) చెట్లను నరికివేసినట్టు అందిన సమాచారం మేరకు సబ్ డీఎఫ్‌వో ఆ ప్రాంతానికి వెళ్లారు. 54 కొత్తూరుపాడు గ్రామానికి చెందిన కొందరు చెట్లు నరికినట్టు ప్రాథమికంగా సమాచారమందిందని స్థానిక అటవీ క్షేత్రాధికారి అబ్బాయిదొర విలేకరులకు తెలిపారు.

అది చిరుత పులి కాదు

రంపచోడవరం మండలం సీతపల్లి అటవీప్రాంతంలో కనిపించింది చిరుతపులి కాకపోవచ్చని, లెపర్డ్ క్యాట్ (చిన్న అడవి పిల్లి) అయి ఉండవచ్చని సబ్ డీఎఫ్‌వో తెలిపారు. ఆ ప్రాంతంలో వీటి సంచారం ఎక్కువగా ఉందన్నారు. అయితే ఏ జాతి జంతువు అన్నది నిర్ధారించడానికి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

పాముకాటుతో మహిళ మృతి


పెద్దచిన్నలమ్మ మృతదేహం

అనంతగిరి: పాముకాటుకు గురై ఓ మహిళ మృతి చెందింది. మండలంలోని మారుమూల పినకోట పంచాయతీ తముటు గ్రామానికి చెందిన కోనేపు పెద్దచిన్నలమ్మ(43) ఇంటి సమీపంలో బుధవారం పాటుకాటుకు గురైంది. గమనించిన కుటుంబ సభ్యులు పినకోట పీహెచ్‌సీ తరలించారు. సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో దేవరాపల్లి మీదుగా కోటపాడు తరలిస్తుండగా ఆనందపురం సమీపంలోని మృతిచెందినట్టు బంధువులు తెలిపారు. జెడ్పీటీసీ గంగరాజు మాట్లాడుతూ.. పినకోట వైద్యాధికారి, సిబ్బంది అందుబాటులో ఉండకపోవడంతో మహిళ మరణించిందని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

సమయపాలన తప్పనిసరి

- ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి


సుండ్రుపుట్టు అంగన్‌వాడీ కేంద్రంలో సూచనలిస్తున్న పీడీ సూర్యలక్ష్మి

పాడేరు రూరల్ : అంగన్‌వాడీ కేంద్రాల సిబ్బంది సమయపాలన పాటించాలని ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి ఆదేశించారు. పట్టణంలోని సుండ్రుపుట్టు, జి. చాకలి పేట, లోచలిపుట్టు అంగన్‌వాడీ కేంద్రాలను గురువారం ఆమె తనిఖీ చేశారు. కేంద్రాల్లో ఇచ్చే పౌష్టికాహారాన్ని లబ్ధిదారులు మాత్రమే తీసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో సరఫరా చేస్తున్న పోర్టిఫైడ్ బియ్యం యొక్క ప్రాముఖ్యతను తల్లులకు వివరించారు. ప్రీస్కూళ్లలో పీపీ-1, పీపీ-2 అంగన్‌వాడీ టీచర్లు పూర్తి పట్టు సాధించి పిల్లలకు మేథోశక్తి పెరిగేలా బోధించాలని సూచించారు. మెను ప్రకారం పిల్లలకు, గర్భిణులు, తల్లులకు పౌష్టికాహారం అందించాలని ఆమె ఆదేశించారు.

మంచినీటి ట్యాంక్ మోటారు చోరీ


మోటారు దొంగతనం జరిగిన మంచినీటి ట్యాంక్

బుచ్చెయ్యపేట : మండలంలో గల నీలకంఠాపురం గ్రామంలో మంచినీటి ట్యాంక్ మోటారును గుర్తు తెలియని వ్యక్తులు పట్టుకుపోయారు. ఇటీవల గ్రామంలో జల్‌జీవన్ మిషన్ పథకంలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ఇంటింటి కుళాయి ఏర్పాటుకు సుమారు రూ.72 లక్షలు మంజూరు చేశారు. గ్రామంలో ఓవర్‌హెడ్ మంచినీటి పథకం నిర్మాణ పనులు జరుగుతున్నాయి. దీనికి సంబంధించిన మోటారును బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పట్టుకుపోవడంపై సర్పంచ్ పడాల నాగభూషణం అధికారులకు ఫిర్యాదు చేశారు.



అంగన్‌వాడీలకు సరకులు సరఫరా చేసే బాధ్యత డీలర్లదే..

- జేసీ శివశ్రీనివాసు


సమావేశంలోని మాట్లాడుతున్న జేసీ శివశ్రీనివాసు

సాక్షి, పాడేరు: అంగన్‌వాడీ కేంద్రాలకు నిత్యావసర సరకులు సరఫరా చేసే బాధ్యత డీలర్లదేనని జేసీ శివశ్రీనివాసు స్పష్టం చేశారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఐసీడీఎస్, పౌరసరఫరాలు, జీసీసీ అధికారులతో గురువారం జేసీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా శివశ్రీనివాసు మాట్లాడుతూ ఎంఎల్‌ఎస్ పాయింట్ నుంచి రేషన్ దుకాణం వద్దకు, అక్కడి నుంచి అంగన్‌వాడీ కేంద్రాలకు ఎండీయూల ద్వారా సరకులు సరఫరా చేయాలన్నారు. ఐసీడీఎస్‌కు సరకులు సరఫరా చేయకపోతే ఎండీయూలను స్వాధీనం చేసుకుంటామన్నారు.

సరకులు పంపిణీలో అలసత్వం వహిస్తే డీలర్లను సస్పెండ్ చేస్తామని ఆయన హెచ్చరించారు. కొన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు ఆయిల్ సరఫరా చేయలేదని, జేసీకి అధికారులు తెలిపారు. వెంటనే స్పందించిన ఆయన ఈనెల 17న ఆయిల్ సరఫరా చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి, పౌరసరఫరాల డీఎస్‌వో శివప్రసాద్, డీఎం గణేష్‌కుమార్, జీసీసీ డీఎం పార్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ ఫిజీషియన్‌తో గడప వద్దే వైద్యసేవలు

- ఏడీఎంహెచ్‌వో లీలాప్రసాద్


వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లో రికార్డులు పరిశీలిస్తున్న డాక్టర్ లీలాప్రసాద్

పాడేరు రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం ద్వారా గడపవద్దే వైద్య సేవలు అందుతున్నాయని ఏడీఎంహెచ్‌వో డాక్టర్ కె.లీలాప్రసాద్ తెలిపారు. మండలంలోని గుత్తులపుట్టు వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ను ఆయన సందర్శించారు. గుత్తులపుట్టు గ్రామంలో నిర్వహిస్తున్న ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని పరిశీలించారు. గర్భిణులు, బాలింతాలు, శిశువులకు అందుతున్న వైద్య సేవలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం పాడేరు పట్టణంలో లోచలిపుట్టు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో నిర్వహిస్తున్న వైద్య శిబిరాన్ని సందర్శించారు. పాఠశాలలో 452 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న 56 మందికి మందులు పంపిణీ చేశారు. మరో ఐదుగురిని జిల్లా ఆస్పత్రికి తరలించాలని సూచించారు. రక్తహీనత ఉన్నట్టు అనుమానిస్తున్న మరో నలుగురిని పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించి నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ తమర్బ విశ్వేశ్వరనాయుడు, జిల్లా ఆస్పత్రి వైద్యాధికారి డాక్టర్ కె.బాబ్జీ, డాక్టర్ మౌనిక, ఎపిడమిక్ సెల్ ఆరోగ్య విస్తరణాధికారి గుల్లెలి సింహాద్రి, ఆరోగ్య విస్తరణాధికారి బి. లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా కలప రవాణా

- 50 వేల జరిమానా


ట్రాక్టర్‌పై తరలిస్తున్న కలప

పాయకరావుపేట : నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా రవాణా జరుగుతున్న కలప ట్రాక్టర్లకు జరిమానా విధించినట్టు అటవీశాఖ సెక్షన్ అధికారి విజయకుమార్ తెలిపారు. నక్కపల్లి మండలం దొండవాక ఏరియా నుంచి ఏవిధమైన అనుమతులు లేకుండా కలప దుంగలు రవాణా జరుగుతున్నట్టు అందిన సమాచారంతో దాడులు నిర్వహించి తాండవ జంక్షన్ వద్ద కలప ట్రాక్టర్లను పట్టుకున్నామన్నారు. వీటికి రూ.50 వేలు జరిమానా విధించినట్టు ఎఫ్.ఎస్.ఓ. విజయకుమార్ తెలిపారు.

రక్తదానంతో ప్రాణదానం

- కలెక్టర్ సుమిత్‌కుమార్


రక్తదాన శిబిరంలో పాల్గొన్న అధికారులు

సాక్షి, పాడేరు:రక్తదానం ప్రాణదానంతో సమానమని కలెక్టర్ సుమిత్ కుమార్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలోని ఏర్పాటుచేసిన రక్తదానం శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అత్యవసర సమయాల్లో రక్తం అందక అనేకమంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ఆరోగ్యవంతంగా ఉన్న ప్రతి ఒక్కరు ఆరునెలలకు ఒక్కసారి రక్తదానం చేయాలని ఆయన సూచించారు. జిల్లాలోని అవసరమైనంత వరకు రక్త నిల్వలు ఉండేవిధంగా చూడాలన్నారు.శిబిరంలో 10 యూనిట్ల మేర రక్తం సేకరించినట్లుగా రెడ్‌క్రాస్ కార్యదర్శి ఈశ్వరరావు తెలిపారు. జేసీ శివ శ్రీనివాస్, డీఆర్వో అంబేద్కర్, వైద్యాధికారి రూపకళ, రెడ్ క్రాస్ కోఆర్డినేటర్ కోటేశ్వరరావు, సభ్యులు జయ, సూర్యారావు పాల్గొన్నారు.

గురుకుల విద్యాసంస్థలకు కన్వీనర్ల నియామకం

జి.మాడుగుల: పాడేరు ఐటీడీఏ పరిధిలోని ఎనిమిది గురుకుల జూనియర్ కళాశాలలకు కన్వీనర్‌గా జి.మాడుగుల గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ యండపల్లి పారయ్యను నియమిస్తూ గురుకులం జాయింట్ సెక్రటరీ ఎం రమణమూర్తి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.12 గురుకుల పాఠశాలలకు కన్వీనర్‌గా అరకు గురుకుల బాలుర పాఠశాల ప్రిన్సిపాల్ బి. ధర్మరాజు, 11ఏకలవ్య పాఠశాలలకు కన్వీనర్‌గా జీకే వీధి ప్రిన్సిపాల్ ఎంవీ రమణారావు నియమితులయ్యారు.

ఘనంగా శివపార్వతుల కల్యాణోత్సవం


కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

సాక్షి,పాడేరు: స్థానిక ఉమానీలకంఠేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ తమర్బ నర్సింగరావులు మోదకొండమ్మతల్లి ఆలయం తరపున ఉమా నీలకంఠేశ్వరస్వామి కళ్యాణ ఉత్సవాలకు రూ.10,016 పట్టు వస్త్రాలను అందజేశారు. ఉమా నీలకంఠేశ్వరస్వామి ఆలయ ధర్మకర్త కొట్టగుల్లి సింహాచలంనాయుడు,రమాదేవి దంపతులతో పాటు పట్టణంలోని అన్ని వర్గాల భక్తులు గురువారం రాత్రి మోదకొండమ్మ ఆలయం నుంచి పట్టు వస్త్రాలు,సారె ఊరేగించారు.అనంతరం ఉమా నీలకంఠేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాన్ని అర్చకులు రామంపంతులు, సుబ్రహ్మణ్యశాస్త్రిల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు.


పట్టు వస్త్రాలను తీసుకొస్తున్న ఆలయ ధర్మకర్త కొట్టగుల్లి సింహాచలంనాయుడు

ముత్యాలమ్మ జాతర ఏర్పాట్లపై ఐటీడీఏ పీవో పరిశీలన


పొల్లూరు జలపాతం ప్రాంతాన్ని పరిశీలిస్తున్న పీవో సూరజ్ గనోరే

మోతుగూడెం: మోతుగూడెం పంచాయతీ పరిధిలోని పొల్లూరు జలపాతం వద్ద ఈనెల 27న నిర్వహించనున్న ముత్యాలమ్మ జాతర ఏర్పాట్లను చింతూరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా పొల్లూరు జలపాతాన్ని ప్రాంతాన్ని పరిశీలించి, పరిసర ప్రాంతాలను శుభ్రం చేసి శానిటైజేషన్ పనులు చేపట్టాలని, భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఎంపీడీవో రవిబాబు, సెక్రటరీ రవినాయక్, రెవెన్యూ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది, జాతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు

అనారోగ్యంతో వసతి గృహ విద్యార్థిని మృతి

దేవీపట్నం: మండలంలోని ముసుళ్లకుంట గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలకు చెందిన మరో విద్యార్థిని చికిత్స పొందుతూ గురువారం మృతిచెందింది. పెనికలపాడు కాలనీకి చెందిన పాడియం యమనశ్రీ (12) ముసుళ్లకుంట ఆశ్రమ పాఠశాలలో ఎనిమిదవ తరగతి చదువుతోంది. వారంరోజుల క్రితం ఇదే ఆశ్రమానికి చెందిన విద్యార్థిని కానెం ఈశ్వరీదేవి అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతి చెందడంతో యమనశ్రీని ఆమె కుటుంబసభ్యులు పెనికలపాడు తీసుకువెళ్లిపోయారు. కొంతకాలంగా దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతున్న ఆమె ఆరోగ్యం రెండురోజుల క్రితం విషమించింది. వెంటనే కుటుంబసభ్యులు ఇందుకూరుపేట పీహెచ్‌సీకి తరలించారు. అక్కడినుంచి మెరుగైన వైద్యానికి రంపచోడవరం ఏరియా ఆస్పత్రికి రిఫర్ చేశారు. బుధవారం ఆమెను కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం మృతి చెందినట్టు ఏటీడబ్ల్యూవో రామతులసి తెలిపారు.